క్లుప్తంగా

ముగ్గుల పోటీలు రేపు

భీమునిపట్నం: భీమిలి ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవా సంఘాల సహకారంతో శాఖ గ్రంథాలయం సమీపంలో శనివారం మధ్యాహ్నం ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గెలుపొందిన ముగ్గులకి బహుమతులతోపాటు, ఇద్దరికి కన్సోలేషన్ బహుమతులు అందిస్తారు. అలాగే 14న ఉదయం 5 గంటలకు సామూహిక భోగి నిర్వహించనున్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి గల వారు 738695663, 7013576546లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలి.

యాత సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా రాములప్పుడు

కొమ్మాది: యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ ప్రాంతానికి చెందిన బాడిదబోయిన రాములప్పుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాత సంక్షేమ సేవా సంఘానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.

ఘనంగా కూడారై ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీవారు

భీమునిపట్నం: భీమిలి సమీపంలోని కీతిన్‌పేట వద్దనున్న ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం కూడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవారికి ప్రత్యేకమైన మహా నైవేద్యాన్ని సమర్పించారు. ఆలయ ట్రస్టీలు కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి, కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కె.భానోజీరావు, కె.శ్రీనివాసరావు, సభ్యులు వి.తాతాజీ, మనోజ్, విష్ణు పాల్గొన్నారు.

తీరానికి కొట్టుకొచ్చిన భారీ తాబేలు కళేబరం



కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు చేపలుప్పాడ తీరం వద్దకు గురువారం భారీ తాబేలు కళేబరం కొట్టుకొచ్చింది. ఇక్కడి మత్స్యకారులు గమనించి వెళ్లి చూసేటప్పటికి మృత్యువాత పడ్డట్లు తెలిపారు. ఇంత పెద్ద తాబేలును ముసుపెన్నడూ చూడలేదని మత్స్యకారులు తెలిపారు. సముద్రంలో పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో మత్స్య జీవరాశులు మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల మంగమారిపేట బీచ్ వద్ద భారీ డాల్ఫిన్, తాబేలు కళేబరాలు కొట్టుకొచ్చిన సంఘటన తెలిసిందే. వరుస సంఘటనలతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఆనందపురం : మండలంలోని వేములవలస జాతీయ రహదారిపై గురువారం మోటార్ బైక్ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పద్మనాభం మండలం గంధవరం గ్రామానికి చెందిన నెలివాడ ఈశ్వరరావు (40) జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మండలంలోని బోయిపాలెంలో బుధవారం రాత్రి పనిచేశాడు. గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరి గంధవరం వెళ్తుండగా... ఆనందపురం ఫ్లైఓవర్‌కు సమీపంలోకి చేరుకునేసరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఈశ్వరరావు తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల చెంతకే ప్రభుత్వ సేవలు



జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ ఎం - 2 కాలనీలో పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

- సచివాలయ వ్యవస్థతో అద్భుత ఫలితాలు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వైభవ్‌నగర్‌లో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు అందించడానికే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ తీసుకొచ్చారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎమ్ ఎం - 2 కాలనీ, వైభవ్‌నగర్‌కు చెందిన అపార్ట్‌మెంట్లు, పరిసర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లోని అపార్ట్‌మెంట్లు, నివాసాల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి భరోసా ఇస్తూ, వారికి ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించిన సంక్షేమ పథకాల పత్రాలు అందజేశారు. ఈ ప్రభుత్వం ద్వారా ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రకంగా సంక్షేమ, ఇతర పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం ద్వారా మేలు జరిగిందని భావించే వారంతా ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. అందరూ ఓట్లు నమోదు చేయించుకుని రానున్న ఎన్నికల్లో వినియోగించుకోవాలని కోరారు. ఎం - 2 కాలనీలో కల్వర్టు, తాగునీరు, దోమలు బెడద, వైభవ్‌నగర్ పార్కు అభివృద్ధి, మురుగునీరు సక్రమంగా ప్రవహించేందుకు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, వీధిలైట్లు, చైన్ స్నాచర్‌ల బెడద నివారించాలని... తదితర సమస్యలు స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, ఏఈ సురేష్, వైఎస్సార్‌సీపీ 6వ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, వార్డు జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ గాదే రోశిరెడ్డి, శ్రావణ్‌కుమార్, సచివాలయ కన్వీనర్లు యర్రా జోగారావు, ఉప్పిలి రాము, వరలక్ష్మి, ఎం.కొండమ్మ, ఎం.అప్పారావు, పోతిన సూరిబాబు, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.కనకరాజు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, రైల్వే బోర్డు సభ్యుడు ఎన్.బాబ్జి, వీవీ నరసింహారావు, వరలక్ష్మి, పోతిన సూరిబాబు, నాయకులు పిల్లా సూరిబాబు, సింహాచలం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు పీకేఎం పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఫుట్ ఓవర్ బ్రిడ్జికి స్థల పరిశీలన



చంద్రంపాలెం హైస్కూల్ వద్ద స్థల పరిశీలన చేస్తున్న అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: ఎట్టకేలకు చంద్రంపాలెం హైస్కూల్ విద్యార్థులు, పరిసర ప్రాంత ప్రజలు, విద్యార్థులకు మధురవాడ హైవే వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి కల సాకారం కానుంది. ఇది అందుబాటులోకి వస్తే సుమారు లక్ష మందికి ప్రయోజనం చేకూరుతుంది. ఇక్కడ రూ.2.50 కోట్ల వ్యయంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి జీవీఎంసీ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు స్థలం, ఏర్పాట్లు పరిశీలించారు. వీరిలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, పార్టీ వార్డు అధ్యక్షులు బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు వాండ్రాసి రవికుమార్, జెడ్సీ కనక మహాలక్ష్మి, ఏసీపీ షబ్‌నాన్ శాస్త్రి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్రవారం మధ్యాహ్నం 1 గంటకు వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు శంకుస్థాపన చేయనున్నట్టు చెప్పారు. ప్రజలు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పోతిన శ్రీనివాసరావు, బంగారు ప్రకాశ్

మధురవాడ: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి మరింతగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'ఆడుదాం అంధ్రా' పోటీలు నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు చెప్పారు. మధురవాడ గాయత్రి విద్యాపరిషత్ ఇంజినీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరుగుతున్నాయి. నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు బంగారు ప్రకాశ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెంద్ర అప్పన్నతో కలిసి క్రీడాకారులను శ్రీనివాసరావు పరిచయం చేసుకుని, టాస్ వేసి మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహద పడతాయన్నారు. అన్ని వయసుల వారిని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, అంతా ఇటువంటి వాటిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించి మధురవాడ ప్రాంతానికి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకోరావాలని కోరారు. వాంబేకాలనీ 2 సచివాలయం - సాగర్‌నగర్ భువనేశ్వరి నగర్ సచివాలయాల మధ్య జరిగిన పోటీలో భువనేశ్వరినగర్ జట్టు విజయం సాధించింది. కార్యదర్శులు జీ.వాసు, ఎల్.లక్ష్మణనాయుడు, శ్రీతేజ తదితరులు పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిష్యత్



కార్యక్రమంలో మాట్లాడుతున్న పర్వతారోహకుడు అనీష్‌వర్మ

ఆనందపురం : యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని పర్వతారోహకుడు అనీష్‌వర్మ అన్నారు. మండలంలోని శొంఠ్యాంలో ఉన్న ఎన్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జాతీయ యువజనోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించడానికి యువత నిరంతరం కృషి చేయాలన్నారు. తాను ఎంతో పట్టుదలతో ఎవరెస్ట్, ఎల్బ్రస్, కిలిమంజారో, అకన్కాగువ పర్వతాలను అధిరోహించి ప్రకృతికి సంబంధించిన ఎన్నో విషయాలు నేర్చుకున్నానని చెప్పారు. మన దేశంలో యువశక్తి అపారంగా ఉందని, వారి సామర్థ్యాలను పాలకులు దేశాభివృద్ధికి వినియోగించుకోవాలని చెప్పారు. విద్యాలయాల యాజమాన్యాలు కూడా యువతకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంభు ప్రసాద్, కార్యదర్శి ప్రసాదరాజు, డైరెక్టర్ రాజా మురుగుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు

- అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం
- త్వరలో రక్షణ గోడల నిర్మాణం
- వర్సిటీ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్



నగరంపాలెంలో ఏయూ భూములను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన మధురవాడ సమీప నగరంపాలెంలో ఉన్న ఏయూ భూములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్సిటీకి చెందిన భూమిని, గతంలో ఇక్కడ భౌతికశాస్త్ర సంబంధ పరిశోధనలకు ఉపయుక్తంగా నిర్మించిన భవనం, తదితర వసతులను పరిశీలించారు. తక్షణం ఈ స్థలం చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని యూనివర్సిటీ ఇంజినీర్‌ను ఆయన ఆదేశించారు. ఈ ఖాళీ స్థలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ హెచ్చరించారు. ఏయూ స్థలాల చుట్టూ రక్షణ గోడల నిర్మాణం, సెక్యూరిటీ సిబ్బంది నియామకం చేపడతామన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సంబంధించిన అంగుళం భూమిని కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామన్నారు. వర్సిటీ ఆస్తులను ఆక్రమించినా, కబ్జా చేయాలని ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహ్మద్‌ఖాన్, ఇంజినీరింగ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు, అధికారులు



మామిడిపాలెంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, సిబ్బంది

ఆనందపురం : భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని పెద్దిపాలెం సర్పంచ్ బావిశెట్టి భారతమ్మ పిలుపునిచ్చారు. స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారతమ్మ మాట్లాడుతూ ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవిష్కరించనున్న దృష్ట్యా ఆయన పిలుపు మేరకు కార్యక్రమం నిర్వహించామన్నారు. బడుగు బలహీన వర్గాల వారికి అంబేడ్కర్ చేసిన కృషిని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ ఆశయాలు కొనసాగిస్తామని ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు మరుపిళ్ల పద్మజ, ఏజీపీ మరుపిళ్ల చిన్నయ్య పాత్రుడు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, గుండు ఎల్లారావు, నిమ్మకాయల అప్పలరాజు, బావిశెట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

తగరపువలస: ఈ నెల 19న విజయవాడలో సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో నిర్వహించనున్న అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అందరం పాల్గొందామని వైఎస్సార్ సీపీ 2వ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ శిల్లా వంశీరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం వార్డులోని మామిడిపాలెంలో సచివాలయ సిబ్బందితో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారన్నారు. సామాజిక వర్గాలకు అతీతంగా ప్రజలంతా అంబేడ్కర్ చూపిన బాటలో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మెట్ల మీద నుంచి జారిపడి కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో మెట్లు దిగుతుండగా జారిన ప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. పార్వతీపురానికి చెందిన వి.రవికుమార్ (46) కుటుంబంతో పెదగంట్యాడలో నివసిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో పని చేస్తున్న రవికుమార్ గురువారం విభాగంలోని ఎయిర్ కంప్రెషర్ ప్లాంట్‌లో ఎత్తులో పని చేసి దిగి వస్తుండగా కాలు జారి కింద పడిపోయారు. గాయపడిన ఆయన, పక్కన ఉన్న స్విచ్ గేర్ రూమ్‌లోకి వెళ్లి పడుకున్నారు. కొద్దిసేపటి తర్వాత సహ కార్మికులు వెళ్లి చూడగా, నోట్లోంచి చొంగ, రక్తం వస్తూ స్పృహ లేకుండా పడి ఉన్నారు. వెంటనే అంబులెన్స్‌లో మెయిన్ గేటు వద్ద ఉన్న ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సమాచారం తెలిసిన స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించనున్నట్లు చెప్పారు. ఎస్‌ఐ సిహెచ్.వి.మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వస్తున్నారు... ఇరుక్కు పోతున్నారు..!



సంతపేట కుమ్మరివీధిలో ముందుకెళ్లే అవకాశం లేక రహదారి మధ్యలో నిలిచిపోయిన వ్యాన్



సంతపేట వద్ద రహదారిపై నిలిచిన వాహనాలు



సంతపేట గొల్లవీధిలో ఎదురెదురుగా వచ్చి దారి లేక నిలిచిపోయిన వాహనాలు

ఇరుకు రహదారుల్లో ఆక్రమణలతో అవస్థలు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్‌లోని పలు వీధులు ఇరుకుగా ఉండడంతో తరచూ వాహనాల రాకపోకలకు ఆటంకం కలుగుతోంది. అసలే ఇరుకైన రహదారులపై ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఎక్కడిపడితే అక్కడ నిలిపివేయడంతో ఇతర వాహనాలు ముందుకు సాగలేకపోతున్నాయి. డ్రైనేజీలను దాటుకుని రహదారులపైకి నిర్మాణాలు చేపట్టడం వల్ల కూడా వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోంది. ప్రధాన రహదారిని వ్యాపారులు ఆక్రమించుకోగా, దీనికి అనుబంధంగా ఉన్న భీమిలి, సంతబయలు, మీ సేవ, ఆదర్శనగర్, కారిౖకవాడ వైపు రహదారులు, గాంధీబొమ్మ, పాత లోకల్ ఆఫీసు, గొల్లవీధి, కుమ్మరివీధుల్లో తరచూ వాహనాల రాకపోకలకు వీలు కాకపోవడంతో నిలిచిపోతున్నాయి. ఇక ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ విద్యాసంస్థల బస్సులు పదుల సంఖ్యలో రావడం, భారీ సరకు రవాణా వాహనాలు గంటల తరబడి రహదారుల పక్కన తిష్ట వేయడంతో ఈ సమస్య మరింత జటిలమవుతోంది. రహదారులు విస్తరించకపోయినప్పటికీ జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆక్రమణలు తొలగించడం, అనుమతి లేని చోట వాహనాలు నిలిపివేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కనకమహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

దాబాగార్డెన్స్ : పాతనగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మవారిని కనకమహాలక్ష్మిగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మచే 250 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

కార్యక్రమంలో దేవాలయ సంఘం అధ్యక్షుడు అరిసెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, కేవీ రమణయ్య, పూసర్ల సంజీవి, పాలూరి వరప్రసాద్, కొల్లూరు రాము, బొడ్డు రఘు, నల్లూరి నూకరాజు, పెనుగొండ కామరాజు, వర్ధనబాబు, కట్టమూరి ప్రసన్న, కుంచం సత్యవతి, సుజాత, శైలజ పాల్గొన్నారు.

పోలీస్‌లు అప్రమత్తంగా వుండాలి



భీమిలి క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న డీసీపీ వెంకటరత్నం

తగరపువలస: భీమిలి క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను క్రైమ్ డీసీపీ పి.వెంకటరత్నం గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. సంక్రాంతి సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సీఐ కె.సురేష్, ఎస్‌ఐ సూర్యప్రకాష్, సిబ్బందికి వివరించారు. అనంతరం ఈ నెల 8న చిట్టివలస గణేష్ థియేటర్ వద్ద బొర్రా సీతారత్నం ఇంట్లోకి అపరిచిత మహిళ చొరబడి బంగారు ఆభరణాలు కాజేసిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఇలాంటి సంఘటనల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జాగ్రత్తలు వహించండి

పీఎం పాలెం: సంక్రాంతి పండగ కోసం స్వస్థలాలకు వెళ్లే వారు తమ ఇంటిని కాపాడుకునే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని క్రైం డీసీపీ పి.వెంకటరత్నం సూచించారు. పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఆమె పలు ఫైల్స్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పండగ సమయాల్లో తాళాలు వేసి ఉన్న ఇంటిని దొంగలు టార్గెట్ చేస్తారని, అలాంటి సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని పోలీసులకు సూచించారు. నిరంతర నిఘా, పోలీసులకు ఎలా సమాచారం అందించాలి, ఊర్లకు వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు.

సీసీ కెమెరాలతో నేరాలు తగ్గుముఖం



అవగాహన కలిగిస్తున్న సీఐ సురేష్, ఎస్ఐ సూర్యప్రకాష్

తగరపువలస : ప్రతి ఒక్కరూ అవసరం మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాలు తగ్గుముఖం పడతాయని మధురవాడ జోన్ క్రైం సీఐ కె.సురేష్ అవగాహన కల్పించారు. గురువారం సాయంత్రం జీవీఎంసీ రెండో వార్డు సబ్బివానిపేట అపార్ట్‌మెంట్ వాసులకు భీమిలి ఎస్ఐ సూర్యప్రకాష్‌తో కలిసి అవగాహన కల్పించారు. సంక్రాంతి పండగ సందర్భంగా అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. షాపింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆన్‌లైన్ నేరాలు, ద్విచక్ర వాహనాల చోరీ, ఇళ్లలో దొంగతనాలపై వివరించారు. ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా బ్యాంకు లాకర్లలో దాచుకోవాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసుకుని ఊర్లకు వెళ్లే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. దీంతో తాము గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. అవగాహన కార్యక్రమంలో చుట్టుపక్కల అపార్ట్‌మెంట్లకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

లాల్ బహదూర్ శాస్త్రికి నివాళి



లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండలి ప్రతినిధులు

తగరపువలస : మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి 58వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ సదర్భంగా మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ నెహ్రూ మంత్రి వర్గంలో రైల్వే మంత్రిగా, దేశానికి రెండో ప్రధానిగా ఆయన సేవలు అందించారన్నారు. 1965లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో సైనికులకు అండగా నిలిచి వారు వీరోచితంగా పోరాటం చేయడానికి స్ఫూర్తి నింపారన్నారు. యుద్ధం అనంతరం తాష్కెంట్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారన్నారు. అతి నిరాడంబర జీవితం గడిపి జై జవాన్, జై కిసాన్ నినాదాన్ని ఇచ్చిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో మండలి గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు, మారోజు సంజీవరావు, కొక్కిరి అప్పన్న, పీరుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.